కొత్త రేషన్‌కార్డులు వచ్చేస్తున్నాయ్..



స్మార్ట్‌ఫోన్‌లో సర్వే వివరాలను నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- వేగవంతంగా దరఖాస్తుల పరిశీలన
- మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో 65శాతం సర్వే పూర్తి
- లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

మహబూబ్‌నగర్ రూరల్: పేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయి. కొత్త కార్డుల కోసం, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం మీసేవ కేంద్రాల్లో చేసుకున్న దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి.. అర్హులైన వారికి కొత్త కార్డుల మంజూరుతో పాటు పాత కార్డుల్లో పేర్లు సైతం చేరుస్తున్నారు. కొన్నేళ్లుగా ఆహార భద్రత కార్డులు మంజూరు కాక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. పెళ్లి అయిన యువతులు, పుట్టిన పిల్లల పేర్లు కొన్నేళ్లుగా కార్డుల్లో నమోదు కాలేదు. కొత్త రేషన్ కార్డులు అసలే మంజూరు కాకపోవడంతో ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం, రాయితీ రుణాలు, రెవెన్యూ కార్యాలయం ద్వారా జారీచేసే ధ్రువపత్రాలు కూడా పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన, మీసేవ కేంద్రాల ద్వారా ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తులకు అవకాశం కల్పించింది. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో కొత్త ఆహార భద్రత కార్డుల కోసం ప్రజాపాలనలో 8,954 దరఖాస్తులు, మీసేవ కేంద్రాల ద్వారా 1,581 దరఖాస్తులు వచ్చాయి. కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్పించేందుకు గాను 5,425 దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన, వార్డు సభల్లో, మీసేవ కేంద్రాల్లో వచ్చిన 15,960 దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ కొనసాగుతోంది.

కొత్త పేర్ల నమోదుకు..

గతంలో కార్డులు రద్దు చేయడానికి, కొత్త కార్డుల నుంచి కుటుంబ సభ్యుల పేర్లు తొలగించడానికి అనేక కారణాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం.. కుటుంబం నుంచి వేరు పడటం, ఒక కార్డు నుంచి మరో కార్డులో చేరిక, వలస వెళ్లడం, చనిపోవడం, రెండు కార్డుల్లో పేర్లు ఉండటం వంటి కారణాలతో రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించారు. ప్రస్తుతం అర్హుల పేర్లు చేర్చడంతో పాటు కొత్త కార్డు పొందడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అర్బన్ మండలంలో 84 చౌకధర దుకాణాలు ఉండగా.. 58,210 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 55,417, అంత్యోదయ కార్డులు 2,759, అన్నపూర్ణ కార్డులు 34 ఉన్నాయి.

వార్డుల వారీగా..

అర్బన్ మండలంలోని 49 వార్డుల వారీగా రెవెన్యూ అధికారులు దరఖాస్తుల పరిశీలన సర్వే చేస్తున్నారు. తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు సర్వే చేసి.. నిజమైన లబ్ధిదారులను నిర్ధారిస్తున్నారు. ఆ తర్వాత లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 65 శాతం మేర సర్వే పూర్తయింది. 35 శాతం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొత్త రేషన్‌కార్డుల మంజూరు, పేర్లు చేర్చడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా చేపడుతున్నాం..



మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల పరిశీలన సర్వే వేగంగా కొనసాగుతోంది. సర్వే ఆధారంగా రెవెన్యూ సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వేకు లబ్ధిదారులు సహకరించాలి.

– దేవేందర్ కేసిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్

క్లుప్తంగా

వైదిక యువశక్తి నిర్మాణ శిక్షణ ప్రారంభం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని ఆర్యసమాజం దయానంద విద్యామందిరంలో సోమవారం వైదిక యువశక్తి నిర్మాణ శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, ఆర్యసభ ఉపాధ్యక్షుడు బాద్మి శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఆర్యసమాజం కట్టుబడి ఉందన్నారు. శిక్షణ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైదిక యువశక్తి నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యసమాజం పెద్దలు గుబ్బ నర్సింహులు, బక్కరాజు, బి.విజయ్‌కుమార్, లవకుమార్, మహేశ్ కుమార్, అంజనాచారి, మిరియాల రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

సత్యేశ్వర ఆశ్రమం పరిశీలన



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సత్యేశ్వర ఆశ్రమాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించి పరిశీలించారు. ఆశ్రమంలో ఉంటున్న వారికి కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల చట్టాలు, హక్కులు, వారికి సంబంధించిన పథకాలను వివరించారు. న్యాయపరంగా ఏమైనా సమస్యలు తలెత్తితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు, జడ్చర్ల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, రామకృష్ణ, సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు నయిమొద్దీన్, శంకర్‌బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఎల్లారెడ్డి (ఫైల్)

అడ్డాకుల: ఎన్‌హెచ్–44పై గతనెల 30న వరుసగా మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన విదితమే. వీరిలో కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన గుడిబండ ఎల్లారెడ్డి (61) సోమవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటాలి



మహబూబ్‌నగర్ క్రీడలు/జడ్చర్ల టౌన్: విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభచాటాలని కింగ్ షోటోకాన్ వైస్‌చైర్మన్ చెన్న వీరయ్య అన్నారు. కింగ్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యకర ఫిట్‌నెస్ కోసం నిరంతరం కరాటే మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేయాలన్నారు. ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే శిక్షణ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కింగ్ షోటోకాన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, కార్యదర్శి అబ్దుల్ జకీ, ఉపాధ్యక్షుడు బాలు మహేందర్ నాయక్, కోశాధికారి తిరుపతయ్య, ఎండీ అతహర్, ఖాజపాషా, కరాటే విద్యార్థులు మహేష్, అమన్, షరీఫ్, ఖిజ్ర తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరాన్ని మాజీ ఎంపీటీసీ బి.రవిశంకర్, ఫ్లెవైక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి ప్రారంభించారు. జూన్ 5వ తేదీ వరకు నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కేఎఫ్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిట్టు, ఉపాధ్యక్షుడు ఖాజామొయినొద్దీన్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నవాబుపేట: మండలంలోని పోమాల్ గ్రామానికి చెందిన కొండనోళ్ల యాదమ్మ (35) అదృశ్యమైంది. ఎస్‌ఐ విక్రమ్ వివరాల మేరకు.. ఈ నెల 2న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన ఆమె తిరిగిరాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. యాదమ్మ సోదరుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహమ్మదాబాద్: మండలంలోని తుర్కషేక్‌పల్లిలో చోరీకి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గతనెల 27న తుర్కషేక్‌పల్లికి చెందిన బెస్త నర్సమ్మ ఇంట్లోకి చౌదర్‌పల్లికి చెందిన అరుణమ్మ, నాగమణి చొరబడి బీరువాలో ఉన్న బంగారం ఆభరణాలు, రూ. 4వేల నగదు చోరీ చేశారు. ఈ విషయాన్ని ఇంటి చుట్టుపక్కల వారు బాధితురాలు నర్సమ్మకు చెప్పడంతో.. దొంగతనానికి పాల్పడిన వారిని నిలదీసింది. ఈ క్రమంలో వారు కొంత బంగారం తిరిగిచ్చారు. మిగతా బంగారం తమవద్ద లేదని చెప్పడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి



దేవరకద్ర: ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని బల్సుపల్లి, చౌదర్‌పల్లి, నాగారం, పెద్దరాజమూర్, బొల్లారం, అజిలాపూర్ తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో చేతికొచ్చిన వరిపంట నేలకొరిగింది. వరి గింజలన్నీ నేలపాలు కావడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి.. ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బ్లాక్‌బెల్టులు పొందిన విద్యార్థులతో శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని పట్టణ కాశికాపుడి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం అప్పన్నపల్లిలోని కమ్యూనిటీహాల్‌లో జీకే మాస్టర్ షోటోకాన్ పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కరాటే బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ చీఫ్ జి.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. కాగా, బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో కన్ఫర్మేషన్ బ్లాక్‌బెల్టులను వి.సాయివర్షిణి, ఎన్.భవ్యశ్రీ, శ్రీచరణ్ ఆచారి, ఎ.విశ్వచరణ్, వి.ఆద్య, కె.జాహ్నవి, బి.వరుణ్, రెడ్డిగల ప్రకాశ్, కగడ సోనాల్, ఎ.లక్ష్మి, ఎ.లోకేష్, ప్రశాంత్ పొందినట్లు మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జీకే షోటోకాన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, బ్లాక్‌బెల్టు మాస్టర్లు నందిని, అక్షర, అభినవ్, భూపేష్, నవతేజ, భార్గవ్ పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం'



కలెక్టర్ విజయేందిర బోయికి సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/భూత్పూర్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా, వీఓఏలు, హమాలీలు, భవన నిర్మాణ తదితర రంగాలకు చెందిన కార్మికులందరూ పాల్గొంటారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలకు పెంచాలని, ప్రభుత్వ రంగాలను బలోపేతం చేయాలని, కార్మిక హక్కులు కాపాడాలన్నారు. ఈ సార్వత్రిక సమ్మెను సకల కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆకుల వెంకటేష్, ఖమర్‌అలీ, ఎం.వెంకటేష్‌గౌడ్, నారాయణ, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

■ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కురుమూర్తి, వెంకటేశ్, మహేష్, శ్రీనివాసులు, నర్సింహులు, మాసమ్మ, భారతమ్మ, నాగమణి పాల్గొన్నారు.

పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీ

కోస్గి రూరల్: మున్సిపల్ కేంద్రంలో నార్కొటిక్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా జరగకుండా కోస్గి పట్టణంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా కిరాణా షాపులు, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో, పాన్‌షాపుల్లో తనిఖీ నిర్వహించారు. ప్రజలు ఎవరైనా గంజాయి మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా 100 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో కోస్గి పోలీసులు విజయ్ కుమార్, నార్కొటిక్ స్నైపర్ డాగ్ విక్కీ,డాగ్ హ్యాండ్లర్ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ రాజేందర్ అగర్వాల్

దేవరకద్ర: భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజేందర్ అగర్వాల్ అన్నారు. సోమవారం దేవరకద్ర రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ గుర్తింపు ఉన్నట్లుగానే.. భూమి ఉన్న ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టు చేపట్టడం జరిగిందన్నారు. రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలు, రైతు ఆధార్ అనుసంధానం ద్వారా ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. పీఎం కిసాన్‌కు కూడా ఇది ఉపయోగ పడుతుందన్నారు. రైతులు ఫార్మర్ ఐడీ పొందడానికి ఆధార్, భూ యాజమాన్య పాస్‌పుస్తకం, లింక్ చేయబడిన ఫోన్ నంబర్ తీసుకుని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. అనంతరం రైతుల వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తాం



నవాబుపేటలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

దేవరకద్ర/నవాబుపేట: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఏఈఓ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

■ నవాబుపేటలో నిర్వహించిన ప్రజావాణికి నాలుగు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ జయరాం నాయక్ తెలిపారు. భూ సమస్యలపై మూడు, పింఛన్ కోసం ఒక దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సోమవారం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్థానిక తెలంగాణ చౌరస్తాలోని బ్రహ్మంగారి ఆలయంలో మూడు రోజులపాటు ఆరాధన, గురుపూజ మహోత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం స్వామివారి సుప్రభాతం నామ సంకీర్తన, ధ్వజారోహణం, కలశ స్థాపన, పుణ్యాహవాచనం, గణపతిపూజ నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే భజన పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భజన పోటీల్లో ఇబ్రహీంబాద్, గొండ్యాల, గార్లపాడ్, కొండాపూర్, జడ్చర్ల, గురుకుంట, అమిస్తాపూర్, పోమాల్ భజన మండలి బృందాలు పాల్గొన్నాయి. అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. మహోత్సవాల్లో భాగంగా మంగళవారం గోవిందమాంబ సమేత శ్రీవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శేఖరాచారి, వి.నారాయణ, ప్రభాకరాచారి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితం



అప్పంపల్లి బస్టాండ్ సమీపంలో పైప్‌లైన్ లీకేజీ

చిన్నచింతకుంట: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడటంతో తాగునీరు కలుషితమవుతోంది. కురుమూర్తి గ్రామ సమీపంలోని మిషన్ భగీరథ పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి గూడూరు గ్రామంతో పాటు కౌకుంట్ల మండలం తిర్మలాపురం, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల గ్రామాలకు తాగునీటిని అందించే పైప్‌లైన్‌కు పలు చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో తాగునీరు వృథా కావడంతో పాటు కలుషితమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తిర్మలాపురం శివాలయం, అప్పంపల్లి బస్టాండ్ సమీపంలో పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు'

నారాయణపేట: రైతుల సాగు సమస్యలు పరిష్కరించి అధిక దిగుబడి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సమిష్టిగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని రూపొందించిందని పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ పరిమళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా వ్యవసాయ పాలిటెక్నిక్ నారాయణపేట శాస్త్రవేత్తలు ఈ నెల 5నుంచి జూన్ 15 వరకు జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మద్దూర్, గుండుమాల్, జాజాపూర్, పాతపల్లి, బైరంకొండ, కంసాన్‌పల్లి గ్రామాలను ఎంపిక చేశారని, ఈ వానాకాలంలో రైతులు వేయవలిసిన పంటలు, ఎంచుకోవలిసిన విత్తనాలు, యూరియా వాడకాన్ని తగ్గించడం, రసాయనాలు వాడకం తగ్గించడం, సాగునీటి సద్వినియోగం, పంట మార్పిడి, పురుగు, ఎరువులు, రసాయనాలు భద్రపరచడం, నేల, పర్యావరణ పరిరక్షణ వంటి పద్ధతులు, మెలకువలను రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శరవేగంగా కేజీబీవీ భవన నిర్మాణం

- రూ. 5కోట్లతో కొనసాగుతున్న పనులు
- విద్యార్థినులకు సకల సౌకర్యాలతో పక్కా భవనం
- వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వచ్చే అవకాశం



గండేడ్‌లో కొనసాగుతున్న కేజీబీవీ భవన నిర్మాణం

గండేడ్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గండేడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం శరవేగంగా నిర్మాణమవుతోంది. ఉమ్మడి మండలంగా ఉన్నప్పుడు కేజీబీవీని 2005 ఆగస్టు 15న ప్రారంభించగా.. మహమ్మదాబాద్‌లో ఏర్పాటుచేశారు. 2020లో మహమ్మదాబాద్ మండలంగా ఏర్పడటంతో 2022లో గండేడ్ మండలానికి కొత్తగా కేజీబీవీని అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 నవంబర్ 9న మండల కేంద్రంలోని అతిథి గృహంలో అప్పటి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చేతులమీదుగా పాఠశాల ప్రారంభోత్సవం చేశారు. ఈ మేరకు ఆరో తరగతిలో విద్యార్థినులకు అడ్మిషన్లు కూడా ఇచ్చారు. అయితే పాఠశాలకు ఇంకా అనుమతులు రాలేదని అధికారులు పేర్కొంటూ నిలిపివేశారు. అప్పటి వరకు గండేడ్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థినులను తిప్పి పంపలేక మహమ్మదాబాద్‌లోని కేజీబీవీలో అవకాశం కల్పించారు. రెండు మండలాల విద్యార్థులు ఒకే చోట ఉండటంతో అప్పట్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే సమయంలో ఎన్నికలు రావడంతో కేజీబీవీ సంగతి మరుగునపడింది. తిరిగి 2024–25 విద్యా సంవత్సరంలో తరగతులను ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు. ఉపాధ్యాయులు, సిబ్బందిని కూడా కేటాయించారు. అయితే అకామిడేషన్ లేదని.. జూలై నెలాఖరులో ప్రారంభిస్తామని చెప్పారు. ఎట్టకేలకు గండేడ్ విశ్వభారతి కళాశాలలో అకామిడేషన్ గుర్తించి.. గత జనవరి 18న గండేడ్ మండలానికి చెందిన 6, 7, 8 తరగతుల విద్యార్థినులను మహమ్మదాబాద్ కేజీబీవీ నుంచి ఇక్కడికి పంపించడంతో తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మండలంలోని వెన్నాచేడ్, చిన్నవార్వాల్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, రంగారెడ్డిపల్లి సల్కర్‌పేట్, పగిడ్యాల్, గండేడ్, బల్సూర్‌గొండ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు 105 మంది ఉన్నారు. ప్రస్తుతం కేజీబీవీకి పక్కా భవనాన్ని అన్ని హంగులతో నిర్మిస్తున్నారు.



ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న అద్దె భవనం

మూడెకరాల స్థలంలో..

మండల కేంద్రం సమీపంలోని 313 సర్వేనంబర్‌లో మూడెకరాల స్థలాన్ని కేజీబీవీ భవన నిర్మాణానికి కేటాయించగా.. రూ. 5కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతి గదులు, హాస్టల్, డైనింగ్ హాల్స్, కిచెన్, ల్యాబ్, స్టోర్, లైబ్రరీ, కంప్యూటర్, స్టాఫ్ రూం, ప్రిన్సిపాల్ రూం ఇలా 30 గదుల నిర్మాణం చేపడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి అన్ని సౌకర్యాలతో భవన నిర్మాణం కొనసాగుతోంది. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్‌లో పనులు పూర్తయ్యాయి. కేజీబీవీ భవనం వచ్చే విద్యా సంవత్సరం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు నిర్మాణ పనులు వేగంగా కొనసాగేలా పర్యవేక్షిస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో అన్ని హంగులతో పాఠశాల భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనం పక్కనే రూర్బన్ నిధులతో నిర్మించిన మినీ స్టేడియం, అతిపెద్ద క్రీడా ప్రాంగణం ఉండటం పాఠశాల విద్యార్థినులకు కలిసి వస్తుంది. మరోవైపు నేషనల్ హైవేకు అతి సమీపంలో ఉండటంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థినుల తల్లిదండ్రులకు రవాణాపరంగా సౌకర్యవంతంగా ఉంటుంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏమాత్రం ఇబ్బందులు లేకుండా తమ పిల్లల విద్యాభ్యాసం కొనసాగుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో లేని ఏఓ కార్యాలయం

భూత్పూర్: మండల వ్యవసాయశాఖ కార్యాలయం రైతులకు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలోని రైతువేదికలో ఏఓ కార్యాలయం ఉండటంతో ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఏదేని పనిపై కార్యాలయానికి వెళ్లాలంటే జంకుతున్నారు. చౌరస్తాలోని ఏఓ కార్యాలయ పాత భవనంలో అధికారులు విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: మూసాపేటకు చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అమ్మిక విద్యావతమ్మ మృతిపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మూసాపేటలో విద్యావతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, కొండ జగదీశ్వర్, నాగిరెడ్డి, నాగార్జునరెడ్డి, బగ్గి కృష్ణయ్య, సీజీ గోవర్ధన్, విజయమోహన్‌రెడ్డి ఉన్నారు.